## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


పరిశీలిస్తున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లిరూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలుగుతామని మండల పరిషత్ అధికారి సుదర్శన్ అన్నారు. పెద్దపల్లి మండలం పాలితం గ్రామంలో సోమవారం సెగ్రిగేషన్ షెడ్, క్రీడాప్రాంగణం, నర్సరీలను పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలిచ్చారు. ఎండకు మొక్కలు ఎండిపోకుండా కాపాడాలన్నారు. ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి చెత్తను వేరు చేసి పంచాయతీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఆ కాలేజీలపై చర్య తీసుకోవాలి

సుల్తానాబాద్: అధిక ఫీజు వసూలు చేస్తున్న ఇంజినీరింగ్ కాలేజీలపై చర్య తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయడం లేదని, దీంతో అధిక ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు దశరథం, మేడవరపు రాజేశ్, రంగు క్రాంతి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### 31న మండల సర్వసభ్య సమావేశం

పాలకుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండల పరిధిలోని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

**ఎంపీపీ ఎన్నిక..**

పాలకుర్తి మండల మండల అధ్యక్ష పదవికి ఈనెల 29వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. ఇటీవల ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతన ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. 29న ఉదయం 11గంటలకు ఎంపీపీ ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి, పెద్దపల్లి డీఆర్‌డీవో ఆర్.రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు

### కూలీలకు మజ్జిగ పంపిణీ

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో సోమవారం ఉపాధిహామీ కూలీలకు గ్రామ గౌడసంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ముల్కల కొమురయ్య స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

### రోడ్డుకు మరమ్మతు


రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ హనుమాన్ నగర్‌లోని సీసీరోడ్డుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం మరమ్మతు చేపట్టారు. ఎన్నికల ప్రచార సమయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వచ్చిన సందర్భంగా రోడ్డును పరిశీలించారు. రోడ్డు బాగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డివిజన్ వాసులు తెలపారు. ఎన్నికల తర్వాత రోడ్డుకు మరమ్మతు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాలనీ కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై ట్రాక్టర్లతో సిమెంట్ చిప్స్‌ను పోయించి రోడ్డుకు మరమ్మతు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, నాయకులు మార్క రాజు, రాకేశ్, ప్రభాకర్, శంకర్, బిక్షపతి, రాజేశం, లింగయ్య పాల్గొన్నారు.

### గుండెపోటుతో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మృతి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ న్యరాశాలపల్లెకు చెందిన ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడు ఈదునూరి అనిల్(30) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న అనిల్ సోమవారం ఉదయం ఇంట్లో ఉండగా ఛాతిలో నొప్పి వస్తుందని తెలపగా వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స అందించేలోపే మృతి చెందాడు. వైద్యులు గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. చిన్న వయసులోనే గుండెపోటుతో అనిల్ మృతి చెందడంతో న్యరాశాలపల్లె గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# పదోవిడత హరితహారానికి సిద్ధం

- 13 నర్సరీల్లో పెరుగుతున్న 1.30లక్షల మొక్కలు
- ఉపాధిహామీ పథకంలో నాటేందుకు ప్రణాళిక
- గతంలో రోడ్లపక్కన, విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు నరికివేతకు గురైన వైనం


జూలపల్లి నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాలను పచ్చని పల్లెలుగా మార్చడమే లక్ష్యంగా చేపట్టిన హరితహారం ఇప్పుడిప్పుడే సత్ఫలితాలు ఇస్తోంది. వరుణుడు కరుణిస్తే సమయానికి పదోవిడత హరితహారం చేపట్టేందుకు ఉపాధిహామీ పథకంలో మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గ్రామీణ నర్సరీల్లో మొక్కలు పెరిగి నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. తొమ్మిది విడతల్లో నాటిన మొక్కలు అక్కడక్కడా పశువులు మేయగా, ఉన్నవి ఏపుగా పెరిగాయి. వర్షాలు పడడమే ఆలస్యం హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

**13 నర్సరీలు.. 1.30లక్షల మొక్కలు**

ఉపాధిహామీలో భాగంగా గ్రామాల్లో ప్రతి ఏటా నాటేందుకు ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులతో ఉపాధి నిధులతో మొక్కలు పెంచుతున్నారు. పెంచిన గ్రామంలోనే మొక్కలు నాటేందుకు తక్కువ శ్రమ, ఖర్చుతో ప్రతీ గ్రామంలో నర్సరీ పెట్టి మొక్కలు పెంచుతున్నారు. మండల కేంద్రంతో పాటు 13 గ్రామ పంచాయతీల పరిధిలో 13 నర్సరీల్లో 1.30లక్షల మొక్కలు పెంచారు. వీటిని త్వరలోనే పదో విడత హరితహారంలో నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**హరితహారంతో కూలీలకు ఉపాధి..**

హరితహారం మొక్కల పెంపకంతో గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు ఉపాధి దొరుకుతోంది. గ్రామంలోనే నర్సరీలు పెట్టి మొక్కలు పెంచుతుండడంతో మహిళలకు రోజూ పని దొరుకుతోంది. మట్టిని పాలిథిన్ కవర్లలో నింపి, విత్తనాలు పెట్టి, నీరు పట్టే వరకు, మొక్కలు నాటేందుకు పంపిణీ, నాటేవరకు ఉపాధి దొరుకుతోంది. తర్వాత మొక్కలు కాపాడేందుకు రక్షణ కంచె, నీరు పోయడం వరకు మహిళలదే ప్రధాన పాత్ర కావడంతో రోజూ ఉపాధి దొరుకుతోందని కూలీలు చెప్తున్నారు.

**విద్యుత్ వైర్ల కింద మొక్కలకు ఆపద..**

మొక్కలు పెంచాలన్న లక్ష్యం మంచిదే అయినా, ఎక్కడపడితే అక్కడ నాటడంతో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రధాన రోడ్ల వెంబడి, విద్యుత్ వైర్ల కింద పెట్టినవి చాలా వరకు పెరగడం లేదు. పంటలకు నీడ వస్తదని రైతులు, కరెంటు సరఫరాకు అడ్డంకిగా ఉన్నాయని కరెంటు వాళ్లు చెట్లను కొట్టి వేస్తున్నారు. దీంతో వేలకు వేలు ఖర్చు పెట్టి పెంచిన చెట్లు కనబడకుండా పోతున్నాయి. ఇప్పటికైనా మొక్కలు నాటేముందు జాగ్రత్తగా వ్యవహరిస్తే ఇబ్బందులు ఉండవని స్థానిక ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

### ప్రణాళిక సిద్ధం



వర్షాలు పడగానే హరితహారం పదోవిడతలో మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు గ్రామీణ నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తాం. – సదానందం, ఏపీవో, జూలపల్లి

### మొక్కలను సంరక్షించాలి



హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుంచుకోవాలి. నాటిన మొక్కల రక్షణకు ఆయా పంచాయతీలు చర్యలు తీసుకోవాలి. అప్పుడే లక్ష్యం నెరువేరుతుంది. – కూనుకుంట్ల రమాదేవి, ఎంపీపీ, జూలపల్లి

## కౌన్సిలర్ 'కొంతం'కు కన్నీటి వీడ్కోలు


ఓదార్చుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు


నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీ నాలుగోవార్డు కౌన్సిలర్ కొంతం శ్రీనివాసరెడ్డికి సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. జమ్మూలోని వైష్ణవీమాతను దర్శించుకుని తిరిగివస్తుండగా ఢిల్లీలో గుండెపోటుకు గురై మరణించిన విషయం విదితమే. సోమవారం సాయంత్రం శ్రీనివాసరెడ్డి పార్థివదేహం పెద్దపల్లికి చేరింది. ఎమ్మెల్యే విజయరమణారావు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్ గౌడ్, బీజేపీ నాయకులు సురేశ్‌రెడ్డి, పర్వతాలు, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి నివాళి అర్పించారు. పట్టణ ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘ నాయకులు, అర్చకులు శ్రీనివాసరెడ్డికి వీడ్కోలు పలికారు.

**కౌన్సిలర్ మృతికి మున్సిపల్ కౌన్సిల్ నివాళి**

పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ (4వవార్డు) కొంతం శ్రీనివాసరెడ్డి గుండెపోటుతో మృతి చెందడంపై మున్సిపల్ పాలకమండలి విచారం వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం శ్రీనివాసరెడ్డి సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు. దాదాపు పాతికేళ్ల కాలంగా ప్రజలకు సేవ చేస్తున్న శ్రీనివాసరెడ్డి ఈ ప్రాంత వాసులకు సుపరిచితుడని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. మేజర్‌పంచాయతీలో వార్డుసభ్యుడిగా, మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా సేవలందించారని గుర్తు చేశారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### రైతులకు అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న ఏఈవో సాగర్

ముత్తారం: మండలంలోని హరిపురం, పోతారం, సీతంపేటలో సోమవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారులు హారిక, సాగర్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాకాలం పంటవేసే క్రమంలో వరికోసిన కొయ్యలను కాల్చకూడదని, కాల్చితే కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. కొయ్యలను కాల్చకుండా నీరు వేసి 3బస్తా ఎస్ఎస్‌పీ వేసినచో వరి కొయ్యకాల్లు మురిగి భూసారం పెరుగుతుందన్నారు. వరిసాగుకు ముందు పచ్చిరొట్ట, జీలుగు వేసి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే క్రమంలో రశీదు తీసుకొని, గడువుకాలం సరిచూసుకోవాలన్నారు. పంట వచ్చే వరకు జాగ్రత్తగా పెట్టుకోవాలని రైతులకు వివరించారు.

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖని మెడికల్ కళాశాల నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణం చేస్తున్న ప్రాంతంలో ఎలాంటి భద్రత, రక్షణ చర్యలు తీసుకోలేదని డీహెచ్‌పీఎస్ నాయకులు జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి (ఏఎల్‌వో) రామ్మోహన్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజా రత్నం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేశ్, రామగుండం నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య, జిల్లా నాయకులు బొడ్డుల రమేశ్ సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు చేస్తున్న ప్రదేశంలో కార్మికులకు సరైన పనిముట్లు, భద్రత లేకుండా శ్రమదోపిడీ చేయడంతో పాటు ఇబ్బందులకు గురి చేస్తూ, ప్రాణాలు పోయే విధంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఎలాంటి భద్రత, రక్షణ చర్యలు చేపట్టకుండా పనులు చేస్తుండగా గోతిలో పడి మృతి చెందితే, ఎలాంటి సంబంధం లేదని కాంట్రాక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుపేద దళితుడైన విజయ్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరారు.

### మండల సర్వసభ్య సమావేశం

పాలకుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండల పరిధిలోని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### ఘనంగా బీరన్న లగ్న పట్నం



జూలపల్లి: మండల కేంద్రంలోని కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరన్న, కమరాతి, మంకాళమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉత్సవాల్లో భాగంగా బీర్ల పూజారులు బీరన్న ఆలయంలో లగ్న పట్నం వేసి, భక్తులకు బీరన్న జీవిత కథను ఒగ్గు కథగా వినిపించారు. అనంతరం భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా బీర్ల పూజారులు మంద మీద సర్గు వేశారు. ఉత్సవాల్లో మహంకాళి బీరప్ప కురుమ సంక్షేమ సంఘం నాయకులు ఎల్కపెల్లి లచ్చయ్య, బొప్పనపెల్లి మల్లేశం, రవి, గుంటి శంకర, బండారి రమేశ్, చీగుర్ల బీరయ్య, ఓదెలు, అశోక్, కనకశేఖర్, ఐలయ్య, శంకర ఉన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు


తనిఖీ చేస్తున్న ఏవో నాగార్జున, ఎస్సై ఓంకార్

కాల్వశ్రీరాంపూర్: పత్తి, మిరప, వరి, కూరగాయల విత్తనాలు, నకిలీ సీడ్స్ విక్రయిస్తే పీడీ యాక్టు, చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఏవో నాగార్జున, ఎస్సై ఓంకార్ యాదవ్ పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో సోమవారం వారు జాయింట్ ఆపరేషన్ చేస్తూ విత్తన వ్యాపార దుకాణాలు తనిఖీ చేశారు. గడువు దాటిన ఉత్పత్తులు విక్రయించినా కేసులు తప్పవన్నారు. ఆయా వ్యాపార కేంద్రాల్లో దుకాణదారులు స్టాక్‌బోర్డు, రేట్లు రాతపూర్వకంగా ప్రదర్శించాలన్నారు. విత్తనాలు కొనేటప్పుడు రశీదు తీసుకోవాలని రైతులకు వారు సూచించారు. బ్యాచ్ నంబర్, ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలన్నారు. ఏఈవోలు రమేశ్, రాజు, పూర్ణచందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**పేద కుటుంబానికి చేయూత**

జూలపల్లి: మండలంలోని తేలుకుంటకు చెందిన నిరుపేద పూరెల్ల లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందించారు. నాయకులు శేఖర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాము, సతీశ్, ఐలాస్, నర్సయ్య, నితిన్, స్వామి ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ


పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎంఏ.అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్, ఎల్లంపల్లి ఎస్సీ కాలనీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని మధ్యాహ్న భోజన నాణ్యతను సోమవారం ఎంపీడీవో ఎంఏ.అలీం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని చిన్నారులకు వారికి కేటాయించిన భోజనాన్ని బాక్సులో ఇంటికి పంపించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి రాబోయే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో వార్షిక వేడుకలు


ముస్తాబైన అయ్యప్ప ఆలయం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షిక వేడుకలు మంగళవారం నుంచి రెండు రోజుల వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో శ్రీఅయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ మూలవిరాట్ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి ఆధ్వర్యంలో కేరళకు చెందిన శ్రీబ్రహ్మశ్రీ సజీవ్ నంబూద్రి గురుస్వామితో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**పూజా కార్యక్రమాల వివరాలు..**

ఈనెల 28న ప్రత్యేక పూజలు, 29న ఉదయం ఆలయంలోని శ్రీగణపతి, నాగరాజు స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, అమ్మవారి, శ్రీఅయ్యప్పస్వామి మూల విరాట్‌లకు 108 కలశాలతో అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం శ్రీసజీవ్ నంబూద్రి గురుస్వామి మహా పడిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేరళ తాంత్రిక విధానంలో జరిగే ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పూజల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

## అద్దె వాహనాలకు కొత్త యూనిట్ రేట్ చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న అద్దె వాహనదారులు

గోదావరిఖని: సింగరేణి నడుస్తున్న అద్దె వాహనాలకు యూనిట్ రేట్ ప్రకారం చెల్లించాలని వాహన యజమానులు కోరారు. ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సంస్థలో నడుస్తున్న వాహనాలకు ఐదేళ్ల కాలపరిమితి ఇవ్వాలన్నారు. అద్దె వాహనాల సీఎంపీఎఫ్ సమస్య హైకోర్టులో ఉన్న నేపథ్యంలో హోల్డ్‌లో పెట్టిన సీఎంపీఎఫ్ సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం అధ్యక్షుడు సుందిళ్ల నాగరాజు, నాయకులు రమేశ్, లక్ష్మణ్, దేవయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదాయం రూ.9.85 లక్షలు


హుండీ లెక్కింపులో అధికారులు, భక్తులు

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎనిమిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల జాతర సందర్భంగా రూ.9.85లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఆలయం ఆవరణలో సోమవారం ఆలయ ఈవో కాంతారావు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపు చేయగా రూ.5.60లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగిన జాతర కోసం టెండర్లు నిర్వహించగా 3.50లక్షలు, టికెట్ల ద్వారా రూ.75,440 సమకూరినట్లు ఈవో కాంతారెడ్డి వెల్లడించారు. పోలీస్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేషనల్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


ఎం.అక్షయ, 9వ తరగతి


నూరొద్దీన్, 3వ తరగతి

రామగుండం: 2023–24 విద్యా సంవత్సరంలో జరిగిన జాతీయస్థాయి సెప్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో పట్టణంలోని నవోదయ, జోసెఫ్ హైస్కూళ్లకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ తెలిపారు. 9వ తరగతికి చెందిన ఎం.అక్షయ జాతీయ స్థాయి 2వ ర్యాంకు, మూడో తరగతికి చెందిన నూరొద్దీన్ రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, నాలుగో తరగతికి చెందిన సారా ఫాతిమా రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, మూడో తరగతికి చెందిన అలిజ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. జాతీయస్థాయి ఒలింపియాడ్ ఫలితాలను సెప్స్ ఒలింపియాడ్ కన్వీనర్ అరకాల రామచంద్రారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బందారపు తిరుపతిగౌడ్, నోయల్ జోసెఫ్, ఆశలత, ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

### రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి మాత రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి గోదావరిఖని తెలంగాణ అంబేడ్కర్ ట్రస్ట్ భవన్‌లో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, అంబేడ్కర్ ఆల్ ఇండియా అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నాయకులు రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘం నాయకులు న్యాతరి రాయమల్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాదం విజయానంద్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, పులి మోహన్, మైస రాజేశ్, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, ఇరుగురాల కృష్ణయ్య, దుబాసి బొందయ్య, శ్రీనివాస్, కనుకుంట్ల సమ్మయ్య, నీరటి శంకర్, పెరిక రవి, పెద్దపల్లి రామస్వామి, కాసిపేట పోచం, ఉప్పులేటి పర్వతాలు, పవన్‌కుమార్, రవికుమార్, మేకల రామస్వామి, బొంకూరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### దళితుల సమాధులు కూల్చివేస్తున్నారు


గౌరెడ్డిపేటలో కూల్చివేతకు గురైన సమాధి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులో అసైన్‌మెంట్ కమిటీ తీర్మానం మేరకు దళితుల శ్మశానవాటికకు కేటాయించిన భూమిని కొందరు ఆక్రమణదారులు చదును చేస్తూ దళితుల సమాధులు కూల్చివేశారని అంబేడ్కర్, దళిత సంఘాల నాయకులు బొంకూరి సునీల్, గజ్జెల శ్రీకాంత్, మల్లేశ్, చాట్ల కుమార్ ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### గృహాలు కూల్చివేసిన ఘటనపై ఫిర్యాదు

రామగిరి: మండలంలోని నాగేపల్లి ప్రధాన చౌరస్తా వద్ద ముందస్తు సమాచారం లేకుండా పోలీసుల బలగాలతో అక్రమంగా గృహాలను కూల్చిన ఘటనపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు కమాన్‌పూర్ మాజీ ఏఎంసీ చైర్మన్ పూదరి సత్యనారాయణ తెలిపారు. సంబంధిత అధికారులు ముందస్తు మార్కింగ్ ఇవ్వకుండా కక్షసాధింపు చర్యలో భాగంగా నివాస గృహాలను కూల్చివేయడంపై కలెక్టర్‌తో పాటు మానవ హక్కుల సంఘం, లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ధర్మల రాజసంపత్, కాపురవేన భాస్కర్ ఉన్నారు.